సాక్షి శ్రీకాకుళం

ఆదివారం । 24 । డిసెంబర్ । 2023



గిరిజన గ్రామాల్లో..

గిరిజన గ్రామాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. నాటుసారా స్థావరాలు ధ్వంసం చేశారు. - 8లో



విద్యారంగంలో మార్పులు..

జీఆర్‌పేయూలో నాలుగేళ్ల డిగ్రీ కోర్సు ప్రారంభమైంది. క్లాస్‌వర్క్ ప్రారంభించారు. - 8లో

26న ఆదిత్యుని హుండీ కానుకల లెక్కింపు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని ఈ నెల 26న లెక్కించనున్నారు. ఉదయం 8 గంటల నుంచి ఆలయ అనివేటి మండపంలో ప్రక్రియను నిర్వహిస్తున్నట్లుగా ఈఓ వి.హరిసూర్యప్రకాష్ తెలియజేశారు. గ్రామపెద్దలు, ఆలయ పాలకమండలి సభ్యులు, పలు శాఖాధికారులు, సిబ్బంది సమక్షంలోనే లెక్కింపు నిర్వహించనున్నారు.

న్యూస్‌రీల్

ఆడుదాం ఆంధ్రాలో అందరూ భాగస్వాములు కావాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆడుదాం ఆంధ్రాలో అందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఆదివారం ఉదయం 6.30 గంటలకు ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు వరకు వినూత్న తరహా క్రీడా సంబరాలతో ర్యాలీ జరగనుందని, ఈ ర్యాలీలో విద్యార్థులు, జిల్లాలో వివిధ శాఖల అధికారులు సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, వాకర్లు, పురప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పోలీసులు, ఎక్సైజ్ అధికారులకు దిశా నిర్దేశం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా

శ్రీకాకుళం పాతబస్టాండ్: పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ఇతర రాష్ట్రాల ఖైదీలను కూడా కోర్టు ముందు హాజరు పరిస్తే కేసులు త్వరగా పరిష్కారమవుతాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా సూచించారు. జిల్లా కోర్టులోని అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ మీటింగ్ నిర్వహించి పోలీసులు, ఎక్సైజ్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. జైల్లో ఉన్న ముద్దాయిల విషయంలో చార్జిషీటు త్వరగా దాఖలు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని అదనపు జిల్లా న్యాయమూర్తులు శ్రీదేవి, భాస్కరరావు, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి అనురాధ, కార్యదర్శి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

'శాశ్వత లోక్ అదాలత్ వినియోగించుకోండి'



జి.జ్ఞాన సువర్ణరాజు

శ్రీకాకుళం పాతబస్టాండ్: శాశ్వత లోక్‌అదాలత్ సేవలు వినియోగించుకోవాలని అదాలత్ చైర్మన్ జి. జ్ఞాన సువర్ణరాజు కోరారు. శాశ్వత లోక్ అదాలత్ ఆధ్వర్యంలో ఆ శాఖ కార్యాలయంలో హై లెవెల్ కమిటీ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా సువర్ణరాజు మాట్లాడుతూ ప్రజా ప్రయోజన సేవల్లో లోపం జరిగితే, ఆ వ్యక్తి శాశ్వత లోక్ అదాలత్‌ను ఆశ్రయించవచ్చని తెలిపారు. అలా వచ్చిన కేసులను శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ తీర్మానించి, సమస్యను బట్టి సంబంధిత శాఖలకు ఆదేశాలు జారీ చేస్తుందన్నారు. శాశ్వత లోక్ అదాలత్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ తరపున ఎస్.తిరుమల చైతన్య, ఎస్.నీరజ, అడిషనల్ డీఎంహెచ్‌ఓ అనురాధ, రెవెన్యూ శాఖ తరపున ఎం.శ్రీకాంత్, పోస్టల్ శాఖ నుంచి ప్రసాదరావు హాజరయ్యారు.



అరసవల్లిలో వైకుంఠ ద్వారం ద్వారా వస్తున్న భక్తులు



ఉత్తర ద్వారం.. ఉత్తమ దర్శనం


వైకుంఠ ఏకాదశి పర్వ దినాన ఆలయాల దారుల్లో భక్తులు బారులు తీరి కనిపించారు. శనివారం వేకువజాము నుంచి కోవెలలకు క్యూ కట్టారు. ఉత్తర ద్వార దర్శనాలకు అన్ని ఆలయాల్లోనూ ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో భక్తకోటి స్వామిని తిలకించి పులకించింది. అరసవల్లి, శ్రీకూర్మం, శ్రీముఖలింగం వంటి ప్రధాన ఆలయాల్లో అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేయగా.. జిల్లావ్యాప్తంగా వైష్ణవ క్షేత్రాలు అందంగా ముస్తాబయ్యాయి . -సాక్షి నెట్‌వర్క్



అరసవల్లిలో భక్తుల కోలాహలం, స్వామి ఉత్సవ మూర్తులు



శ్రీకాకుళంలోని నారాయణ తిరుమల ఆలయం వెలుపలకు వచ్చేసిన భక్తుల క్యూ



మందస: వాసుదేవుని ఆలయంలో..

నేటి విద్యార్థులు.. రేపటి శాస్త్రవేత్తలు

- అబ్బురపరిచిన జిల్లాస్థాయి సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శన
- రాష్ట్రస్థాయికి 9 ప్రాజెక్టుల ఎంపిక

శ్రీకాకుళం రూరల్:

విద్యార్థులు మెదడుకు పదును పెట్టారు. పరిశోధనల్లో మజాను ఆస్వాదించారు. జిల్లాస్థాయి సైన్స్ ప్రాజెక్టుల ప్రదర్శనలో పాల్గొని అబ్బుపరిచారు. మొత్తం 90 ప్రాజెక్టులు ప్రదర్శించగా.. 9 రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. మునసబుపేటలోని గురజాడ, గాయత్రీ ఎడ్యుకేషన్ సొసైటీ కేంద్రంలో ఎస్‌సీఈఆర్‌టీ, ఏపీ స్కూల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో శనివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఈఓ వెంకటేశ్వరరావు, నోడల్ అధికారి విజయ్‌కుమార్, డిప్యూటీ డీఈఓ పగడాలమ్మ, సైన్స్ కోఆర్డినేటర్ ఎన్.కుమారిస్వామి పాల్గొన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రాజెక్టుల వివరాలు..

• ప్రాజెక్టు పేరు: స్మార్ట్ హెల్మెట్



విద్యార్థి : బి.టీనా, 9 వ తరగతి
స్కూల్ : జెడ్పీహెచ్‌ఎస్ బాతుపురం, వజ్రపుకొత్తూరు
ఈ హెల్మెట్‌ను ఆర్డియోనా సిస్టం ద్వారా బైక్‌కు కనెక్ట్ చేసుకోవాలి. రోడ్డు ప్రమాదం జరగకుండా ఇది కాపాడుతుంది. చిన్న చార్జబుల్ బ్యాటరీతో పనిచేస్తుంది. తాగి బైక్ తీసినా, హెల్మెట్ పెట్టుకోకపోయినా ఇది బండిని ముందుకు కదలనివ్వదు.

• ప్రాజెక్టు పేరు : స్మార్ట్ కాప్ ప్రొటెక్షన్



విద్యార్థి : ఎస్.జ్యోత్స్న, 10వ తరగతి
స్కూల్ : జెడ్పీహెచ్‌ఎస్, రంగోయి, పలాస
జంతువులు, మనషుల నుంచి పంటకు ఎలాంటి ప్రమాదం పొంచి ఉన్నా ఈ స్మార్ట్ కాప్ ప్రొటెక్షన్ రక్షిస్తుంది. పొలం చుట్టూ నాలుగు వైపులా సెన్సార్‌ను బిగించాలి. జంతువులు వచ్చినా, మనుషులు వచ్చినా మనకు సౌండ్ అలర్ట్ చేసి, సెల్‌కు మేసేజ్ వస్తుంది.

• ప్రాజెక్టు పేరు : ఇన్నోవేట్ మల్టిపుల్ ప్రాజెక్ట్స్ ఆన్ లైట్ ఎక్స్‌పెరిమెంట్



టీచర్ : బి.వెంకటరావు, భౌతిక శాస్త్రం
స్కూల్ : జెడ్పీహెచ్‌ఎస్, మెట్టవలస
సైన్స్‌లో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో కాంతిని దీర్ఘదృష్టి, హ్రస్వదృష్టి ద్వారా వివరిస్తారు. ఇది సిలబస్‌లో లేనప్పటికీ యూవీ పద్ధతిలో నాభ్యంతరాన్ని, కిరణరేఖ చిత్రాల ద్వారా ఈజీగా విద్యార్థులకు వివరించేందుకు వెసులుబాటు ఉంది.

• ప్రాజెక్టు పేరు : ఎలక్ట్రిసిటీ జనరేటర్



విద్యార్థులు : జయప్రసాద్, సాయికుమార్, హర్షిత్ (9వ తరగతి)
స్కూల్ : జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, ఎచ్చెర్ల
ఇంటి అవసరాలకు వాడుకునే జనరేటర్ ఇది. దీంతో సెల్ ఫోన్‌లను చార్జింగ్ చేసుకోవచ్చు. సైక్లింగ్ చేస్తూ దీనికి చార్జింగ్ చేసుకోవచ్చు. చరఖాతో దారం విసురుతూ బ్యాటరీని చార్జింగ్ పెట్టుకోవచ్చు.

• ప్రాజెక్టు పేరు: ఈ-టాయిలెట్



విద్యార్థి : కె.రేష్మ, 8వ తరగతి
స్కూల్ : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, పాతపట్నం
అత్యవసర సమయాల్లో ఈ-టాయిలెట్ ఎంతో ఉపయోగపడుతుంది. ఆర్‌ఎఫ్‌ఐడీ కార్డు ద్వారా ఏటీఎం లాగా స్కాన్ చేసుకొని లోపలికి ఎంట్రీ కావచ్చు. డబ్బులు చెల్లించి వాడుకోవచ్చు. అల్ట్రా సెన్సార్ సిస్టం ద్వారా ఇది పని చేస్తుంది.

• ప్రాజెక్టు పేరు : ఫైర్ అండ్ స్మోక్ డిటెక్టివ్



విద్యార్థులు : జె.దిలీప్, ఓ.మహాపాత్రో, 9వ తరగతి
స్కూల్ : జెడ్పీహెచ్‌ఎస్, కొళిగాం, ఇచ్ఛాపురం
ఇది ప్రమాదాలను గుర్తించే సెన్సార్. రైలు, బస్సుల్లో ప్రమాదాలను గుర్తించేందుకు ఒక బోగీలో మూడుచోట్ల సెన్సార్‌ను పెట్టుకోవాలి. అగ్ని, పొగ వంటివి వచ్చేటప్పుడు ఇది గుర్తించి అప్రమత్తం చేస్తుంది. డ్రైవర్‌ను కూడా అలర్ట్ చేస్తుంది.

• ప్రాజెక్టు పేరు : బయోడీగ్రేబుల్ శానిటరీ నాప్‌కిన్స్



విద్యార్థులు:బి.హరిప్రియ, ఐ.రోహన్ (9వతరగతి)
స్కూల్ : జెడ్పీహెచ్‌ఎస్, మురపాక
మొక్కజొన్న పొత్తులను ఉపయోగించి స్త్రీల రుతుక్రమం సమయంలో వాడే నాప్‌కిన్స్ తయారు చేశారు. మొక్కజొన్న పొత్తులను గుండగా చేసి దానిలో పోటాషియం హైడ్రాక్సైడ్ వేసి దీన్ని తయారు చేశారు. ఇది పర్యావరణానికి ఎలాంటి హాని చేయదు. మహిళలకు ఎక్కువగా ఉపయోగపడుతుంది.

ప్రాజెక్టు పేరు : విజువలైజేషన్ ఆఫ్ మ్యాథమేటిక్స్ అండ్ కాన్సెప్ట్



టీచర్ : టీబీఎస్ శర్మ, గణితం
స్కూల్ : జెడ్పీహెచ్‌ఎస్, వప్పంగి
దీని ద్వారా గణిత భావనలను విద్యార్థులకు వివరించవచ్చు. దీనిద్వారా బోధించడం ఉపాధ్యాయులకు సులువుగా ఉంటుంది. అర్థమేటిక్ క్యాలిక్యులేషన్, గణితాన్ని సులువుగా నేర్చుకోవచ్చును. వీటితో పాటు భ్రమణ సౌష్టవం, బిందు సౌష్టవం, పూర్ణసంఖ్యల ప్రక్రియ, ఎత్తులు దూరాలు తెలుసుకోవచ్చును.

• ప్రాజెక్టు పేరు : లైఫ్‌సేఫ్టీ స్టిక్



టీచర్ : పి.గౌరీశ్వరరావు, భౌతిక శాస్త్రం
స్కూల్ : మున్సిపల్ హై స్కూల్, చింతాడ
పాముల నుంచి రైతులు భద్రత పొందేందుకు లైఫ్ స్టిక్ ఉపయోగపడుతుంది. ఈ స్టిక్‌లో వైబ్రేట్, లైట్, సౌండ్ అనే మూడు సిస్టంలు ఉంటాయి. పొలంలోకి స్టిక్‌తో వెళ్లినపుడు వైబ్రేట్ ఆన్‌చేస్తే దాని వైబ్రేషన్ ద్వారా పాములు, ఇతరత్రా జంతువులు దగ్గరికి చేరవు. స్టిక్‌కు అమర్చిన ఎల్‌ఈడీ లైట్ వెలుగుతో పనులు చేసుకోవచ్చు.

డిగ్రీ రెండో సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం అనుబంధ కళాశాలల్లో డిగ్రీ రెగ్యులర్ రెండో సెమిస్టర్ ఫలితాలను వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు శనివారం విడుదల చేశారు. అనంతరం జ్ఞానభూమి పోర్టల్‌లో అందుబాటులో ఉంచారు. 7455 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 3001 మంది ఉత్తీర్ణత సాధించారు. 45.25 శాతం ఉత్తీర్ణత నమోదైంది. బీఎస్సీలో 4969 మందికి 1957, బీకాం 1286 మందికి 498, బీఏలో 870 మందికి 316, బీసీఏలో 210 మందికి 143, బీబీఏలో 120కి 87మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. రీ వాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 15 రోజుల్లోపు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎగ్జామినేషన్ డీన్ డాక్టర్ ఎస్.ఉదయ భాస్కర్ పాల్గొన్నారు.

27న మూలపేట పోర్టు నిర్మాణ పనుల పరిశీలన

నరసన్నపేట: సంతబొమ్మాళి మండలం మూలపేటలో రూ.4362 కోట్లతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పోర్టు నిర్మాణ పనులను ఈ నెల 27న జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజా ప్రతినిధులు పరిశీలించనున్నారని నరసన్నపేట ఎమ్మెల్యే, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ తెలిపారు. ఈ సందర్శన కార్యక్రమం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, పార్టీ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. ఆ రోజు ఉదయం 10.30 కల్లా జిల్లా ప్రతినిధులు మూలపేట చేరుకోవాలని పిలుపునిచ్చారు. అక్కడే మీడియా సమావేశం నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్న భోజనం అనంతరం పలాసలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌కు చేరుకొని కిడ్నీ బాధితులకు వైద్యం అందుతున్న తీరు, ఆధునిక పరికరాల వినియోగాన్ని పరిశీలిస్తారని తెలిపారు. ఈ మేరకు శనివారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు.



క్యాండిల్ లైట్ సర్వీస్‌లో పాల్గొన్న జేసీ నవీన్, పాస్టర్లు



విద్యుత్ కాంతులతో ధగధగలాడుతున్న శ్రీకాకుళంలోని చర్చి

లోక రక్షకుని రాకకై..

శ్రీకాకుళం కల్చరల్: క్రీస్తును అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఇన్‌చార్జి కలెక్టర్, జేసీ ఎం.నవీన్ అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో క్రిస్మస్ హైటీని శనివారం నిర్వహించారు. పాస్టర్ రూబెన్ ప్రార్థనలు చేసి బైబిల్ చదివారు. పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు బిషప్ డీఎస్‌వీఎస్ కుమార్ మాట్లాడుతూ క్రీస్తు జననం కోసం వివరించారు. రెవ.జాన్ జీవన్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

సమాచార శాఖలో..

జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి కె.చెన్నకేశవరావు క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీపీఆర్‌ఓ కె.బాలమాన్ సింగ్, పట్టు పరిశ్రమలశాఖ సహాయ సంచాలకులు అలజంగి విక్టర్ సాల్మన్ రాజు, డివిజనల్ పీఆర్‌ఓ సత్తల రాజు, ఏఐఈ అప్పలనాయుడు, పాస్టర్ అలజంగి నవీన్‌కుమార్, పీఆర్‌ఓ సత్యప్రసాద్, ఫోటో గ్రాఫర్ కిల్లాడ రాజు, నత్తల కల్యాణ్ ప్రసాద్, రికార్డు అసిస్టెంటు శ్రీనివాసరావు, పప్పల రామోజీరావు, శిమ్మమ్మ, రాంభాయ్, తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న సమాచార పౌర సంబంధాల అధికారి



శ్రీకాకుళంలోని చర్చిలో గీతాలాపన

వినియోగదారుల హక్కులపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న కమిషన్ న్యాయమూర్తి రఘుపాత్రుని చిరంజీవి

శ్రీకాకుళం పాతబస్టాండ్: వినియోగదారుల చట్టంపై అవగాహనతోనే స్వచ్ఛమైన ఆర్థిక సమాజం సాధ్యమవుతుందని వినియోగదారుల వ్యవహారాల కమిషన్ న్యాయమూర్తి రఘుపాత్రుని చిరంజీవి పేర్కొన్నారు. జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని అడ్వకేట్స్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ అండ్ అవేర్‌నెస్ (ఆశ్రా)సంస్థ స్థానిక ఉమెన్స్ కాలేజీలో శనివారం నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ చట్టం వస్తు విక్రయం అనంతరం అందించాల్సిన సేవలను పరిరక్షిస్తుందన్నారు. ఈ సందర్భంగా పలు కేసులను ప్రస్తావించారు. జిల్లా సివిల్ సప్లై అధికారి డి.వెంకట రమణ హక్కులు, బాధ్యతల గురించి వివరించారు. తూనికలు, కొలతల శాఖ సహాయ కంట్రోలర్ పనిముట్లతో ప్రదర్శన ఇచ్చి తూనికల్లో మోసాలను వివరించారు. ఆశ్రా అధ్యక్షుడు డాక్టర్ గంజి ఎజ్రా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ ఇందిర, దిశా పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ రేవతి, ఆశ్రా ప్రతినిధులు న్యాయవాదులు లఖినాన రవికుమార్, కట్టా పార్థసారథి విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతి ఫెడరిక్, తూనికలు కొలతలు శాఖ ఇన్‌స్పెక్టర్ రాజా రమేష్ ఉమెన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సూర్య చంద్రరావు, అధ్యాపకులు కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.

ఒకరికి కారుణ్య నియామకం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఆమదాలవలస సోషల్ వెల్ఫేర్ బాలుర హాస్టల్‌లో పనిచేస్తూ మృతి చెందిన వి.పార్వతి కుమారుడు యుగంధర్‌కు కారుణ్య నియామక పత్రాన్ని శనివారం అందజేశారు. ఆమె 2017లో అనారోగ్య కారణాలతో మృతి చెందారు. దీంతో ఆమె కుమారుడిని కారుణ్య నియామక పత్రాన్ని సాంఘిక సంక్షేమ శాఖ డీడీ విశ్వమోహన రెడ్డి అందజేశారు.

విద్యారంగంలో మార్పులు అనివార్యం

- విజయనగరం గిరిజన కేంద్రీయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టమణి
- వర్సిటీలో నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ టీచర్స్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం ప్రారంభం



మాట్లాడుతున్న విజయనగరం కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ టీవీ కట్టమణి

ఎచ్చెర్ల క్యాంపస్: విద్యా రంగంలో కాలానుగుణంగా మార్పులు రావడం అనివార్యమని విజయనగరంలోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ టీవీ కట్టమణి అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో ఈ ఏడాది నూతనంగా ప్రారంభించిన నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ టీచర్స్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం క్లాస్‌వర్క్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. నూతన విద్యావిధానం అమలు నేపథ్యంలో అనేక మార్పులు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. నాలుగేళ్ల కోర్సుతో డిగ్రీ+బీఎడ్ పూర్తవుతుందని అన్నారు. ఈ కోర్సు పూర్తిచేసిన విద్యార్థులు ఉపాధ్యాయులకు కావాల్సిన పూర్తి విజ్ఞానం సాధిస్తారని అన్నారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు మాట్లాడుతూ ఈ ఏడాది ఈ కోర్సు ప్రారంభించిన అతి తక్కువ విద్యాసంస్థల్లో వర్సిటీ ఒకటని చెప్పారు. విద్యార్థులను నిష్ణాతులు, నిపుణులైన ఉపాధ్యాయులుగా తీర్చిదిద్దే లక్ష్యంగా ఈ కోర్సు సిలబస్‌ను నిపుణులు తయారు చేశారని పేర్కొన్నారు. విద్యార్థులకు మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాళ్లు ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్, డాక్టర్ సీహెచ్ రాజశేఖర్‌రావు, సీడీడీ డీన్ ప్రొఫెసర్ పి.సుజాత, కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ హనుమంతు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ చౌర్యంపై కేసు నమోదు

సంతబొమ్మాళి: మండలంలోని కొల్లిపాడు గ్రామంలో డి.మాకయ్య అనే వ్యక్తి రొయ్యల చెరువుకు అక్రమంగా విద్యుత్ చౌర్యం చేయడంతో కేసు నమోదు చేసినట్లు టెక్కలి విద్యుత్‌శాఖ ఏడీ ఈ ఎస్.శ్రీనివాస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమాచారం మేరకు పరిశీలించగా విద్యుత్ చౌర్యం జరిగినట్లు గుర్తించామని అన్నారు. అసెస్‌మెంట్ రూ. 2,64,722లు కాంపౌండ్‌గా రూ. 38వేలు మొత్తం రూ. 3,02,722 ఫైన్ వేశామని అన్నారు.

ఎరుకుల సేవా సంఘం ఉత్తరాంధ్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా సూర్యారావు



గొర్లె సూర్యారావు

పొందూరు: ఏపీ ఎరుకుల సేవా సంఘం ఉత్తరాంధ్ర కమిటీ ప్రధాన కార్యదర్శిగా గొర్లె సూర్యారావు ఎంపికయ్యారు. ఆ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉత్తర్వులు జారీ చేశారు. గొర్లె సూర్యారావుకు పదవి వరించినందుకు జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పప్పల రమేష్‌కుమార్, కిల్లి నాగేశ్వరరావు, గాడు నాగరాజు, బండారు ప్రతాప్‌కుమార్, అనకాపల్లి గోవిందరావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మృతిచెందిన పోలిరెడ్డి

ఎచ్చెర్ల, లావేరు: లావేరు మండలంలోని కేశవరాయునిపాలేం గ్రామంలో గుజ్జి పోలిరెడ్డి (28) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పోలిరెడ్డి తన భార్య గౌరితో కలిసి విశాఖపట్నంలో పాత ఇనుపకొట్టులో పనిచేసి జీవనం గడిపేవాడు. ఇరవై రోజుల కిందటే ఆయన స్వగ్రామానికి కుటుంబంతో సహా వచ్చేశారు. శుక్రవారం రాత్రి 9.30 గంటల సమయంలో పోలిరెడ్డి తండ్రి ఎరకయ్య, తమ్ముడు శ్రీనులు కల్లం వద్ద పడుకునేందుకు వెళ్లగా అక్కడ పోలిరెడ్డి తీవ్ర గాయాలతో కనిపించాడు. హుటాహుటిన ఇంటికి తీసుకెళ్తుండగా దారిలోనే మృతి చెందారు. భార్య గౌరీ పిర్యాదుమేరకు లావేరు ఎస్ఐ కోటీశ్వరరావు కేసు నమోదుచేశారు. సీఐ ఆదాం కేసు దర్యాప్తు చేస్తున్నారు. డీఎస్పీ శృతి సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా మారథాన్



మారథాన్‌లో సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, ఎంపీపీ సరోజనమ్మ, సర్పంచ్ సుజాత తదితరులు

టెక్కలి: ప్రభుత్వం ఎంతో క్రీడా స్ఫూర్తితో నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా శనివారం టెక్కలిలో మారథాన్‌ను ఉత్సాహంగా నిర్వహించారు. టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ జెండాను ఊపి మారథాన్‌ను ప్రారంభించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకు ప్రజాప్రతినిధులు, అధికారులు, క్రీడాకారులు, యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎ.సరోజనమ్మ, సర్పంచ్ జి.సుజాత, ఎంపీడీఓ సిహెచ్.లక్ష్మీబాయి, తహసీల్దారు కె.ప్రవల్లిక, పంచాయతీ ఈఓ మల్లేశ్వరరావు, ఎంఈఓలు తులసీరెడ్డి, చిన్నారావు, పీడీలు నారాయణరావు, ఆదిశేషు, జగ్గమ్మ, అధికారులు హెచ్.వి.రమణమూర్తి, కొండలరావు, జేసీఎస్ ఇన్‌చార్జి ఎస్.మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి రోల్ ప్లే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



సత్యవరం విద్యార్థులకు షీల్డ్, ప్రశంసా పత్రాలు ఇస్తున్న డైరెక్టర్ హేమరాణి

నరసన్నపేట: సత్యవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో నిర్వహించిన రోల్ ప్లే పోటీల్లో ద్వితీయ స్థానం పొంది ప్రతిభ చూపారు. ఏలూరు జిల్లా తోటపల్లిలో రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ(ఎస్‌సీఈఆర్టీ), రాష్ట్ర విద్యా శాఖ ఈనెల 22న పోటీలు నిర్వహించింది. ఇందులో పాల్గొన్న హైస్కూల్ విద్యార్థులు హస్సిక, కళ్యాణి, భార్గవి, ధనుష్‌లు న్యూట్రిషన్ ఫుడ్ అనే అంశంపై రోల్‌ప్లే ప్రదర్శించారు. రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ డైరెక్టర్ హేమరాణి విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, షీల్డ్‌లు అందించారు.

గిరిజన గ్రామాల్లో కార్డన్ సెర్చ్



నాటుసారాను స్వాధీనం చేసుకున్న పోలీసు, సెబ్ అధికారులు

మందస: గిరిజన గ్రామాల్లో పోలీసులు, ఎస్ఈబీ అధికారులు సంయుక్తంగా శనివారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. కొండలోగాం పంచాయతీలోని పలు గిరిజన గ్రామాల్లో విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఎస్పీ జి.రాధిక, ఎస్ఈబీ అడిషనల్ ఎస్పీ వి.మణికంఠ ఆదేశాల మేరకు దాడులు నిర్వహించినట్టు అధికారులు చెప్పారు. 150 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని, సవర తిరుపతి, ప్రభావతి, కుమారిలను అరెస్ట్ చేసి, సోంపేట కోర్టులో హాజరుపరిచామన్నారు. 1400 లీటర్ల పులియబెట్టిన నాటుసారాను ధ్వంసం చేసినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్ఈబీ సోంపేట ఇన్‌స్పెక్టర్ టీవీపీ నాయుడు, కాశీబుగ్గ రూరల్ సీఐ జి.శంకరరావు, ఇంటెలిజెన్స్ సీఐ టీవీ మురళీధర్, టాస్క్‌ఫోర్స్ సీఐ బి.నరసింహామూర్తి, మందస ఎస్ఐ సీహెచ్ హరికృష్ణ, పాల్గొన్నారు.


ఆదిత్యుని సన్నిధిలో బుల్లితెర నటి మేఘన



మేఘనకు ఆదిత్యుని జ్ఞాపికను అందజేస్తున్న మండవిల్లి రవి, శంకరశర్మ

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని వైకుంఠ ఏకాదశి నాడు స్వర్ణాలంకరణలో తొలిసారిగా దర్శించుకోవడం నిజంగా చాలా అదృష్టంగా భావిస్తున్నానని బుల్లితెర నటి మేఘనా లోకేష్ అన్నారు. శనివారం ఉదయం ఆమె తొలిసారిగా అరసవల్లి క్షేత్రాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకర శర్మ, పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం అరసవల్లి క్షేత్రం విశిష్టతను ఆమెకు శంకరశర్మ వివరించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

'సీఎంఓ దృష్టికి బెంతు ఒరియాల సమస్య'



బెంతు ఒరియా సంఘ నాయకులతో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని బెంతు ఒరియా కులస్తులకు సంబంధించిన కుల ధ్రువీకరణ పత్రాల సమస్యను సీఎంఓ దృష్టికి తీసుకెళ్లనున్నట్లు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. ఆయన స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఇచ్ఛాపురం నియోజకవర్గానికి చెందిన బెంతు ఒరియా కుల పెద్దలతో మాట్లాడారు. తమకు బెంతు ఒరియా కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకపోవడంతో ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు దక్కడం లేదని, ఉన్నత చదువులు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యోగ అవకాశాలు దక్కకుండా పోతున్నాయని బెంతు ఒరియా సంఘ నాయకులు అధికారుల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది జనవరి నెలలో తమకు ఇంటిగ్రేటెడ్ కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చారని, మళ్లీ వాటిని వాపసు తీసుకున్నారని తెలిపారు. ఈ సమస్యను కలెక్టర్ ద్వారా ఉన్నతాధికారులకు నివేదిస్తామని జేసీ అన్నారు. ఆయన వెంట పలాస ఆర్డీఓ భరత్ నాయక్, తహసీల్దార్ పి.మీనాదేవి, ఉప తహసీల్దార్‌లు ఎస్.గురుప్రసాద్, బి.శ్రీహరి, బెంతు ఒరియా సంఘ నాయకులు శివ బిసాయి మాస్టార్, దేవరాజు సాహూ, దుద్దిష్టి మజ్జి, సుమన్ బిసాయి, శ్రీకాంత్ పురియా, నవీన్ బిసాయిలు ఉన్నారు.

నేడు కాళింగుల వనసమారాధన

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కాళింగ సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వన సమారాధన నిర్వహించనున్నట్లు సంఘ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పి.సూర్యం తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమాన్ని శ్రీకాకుళం నగరంలో కాళింగభవన్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. కళింగ డైరీ-2024, క్యాలెండర్ ఆవిష్కరణ, వివాహ పరిచయ వేదిక ఉంటుందని పేర్కొన్నారు.